


# కొత్త తండ్రి

ఇచ్ఛాపురపు రామచంద్రం

"బాబూ! ప్రసాద్!

ఆశీస్సులు.

నీ ఇంట్లోనే...నీతో పాటే ఉంటున్న మనిషి... నీ తండ్రి దగ్గర నుంచి ఉత్తరమేమిటా యింత పెద్ద ఉత్తరం ఎందుకా అని ఆశ్చర్యపడకు.

నువ్వు తీరిక లేని చర్యలో సతమత మౌతూంటావని ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నా, నిన్నూ, నీ అమూల్య కాలాన్నీ ఎక్కువసేపు తీసుకోవడం నాకు తగదని తెలిసినా..తప్పడం లేదు. మళ్లీ ఇలాంటి అవసరమూ, పరిస్థితీ రాకూడదనే ఆ భగవంతుణ్ని కోరుకుంటున్నాను.

కాలం మారిందని కళ్లున్న నేను కానక పోలేదు.

నీ వెనుక తరానికి ఉత్తరాల రోజులకి చెందిన వాడిని నేను.

నువ్వేమో...ఈ తరానికి యీ మెయిలూ, కంప్యూటరూ, ఎస్.ఎమ్.ఎస్, సెల్ ఫోన్‌ల తరానికి చెందినవాడివి. నీకూ నాకూ మధ్య ఎంతో దూరం. అంతరం దీనినీ నేను అర్థం చేసుకోకపోలేదు. ఆమోదించకపోనూ లేదు.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం- ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

తరాల మధ్య అంతరం కాలం తీర్పు ఎటొచ్చీ దురదృష్టమో ఏమో కాని...మన తరాల మధ్య తరించలేనంత అంతరం ఏర్పడింది. సాంకేతిక విజ్ఞానం ఒక్కసారి పాలపొంగులా వెల్లి విరిసినందువల్ల కాబోలు అతి త్వరితంగా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచీకరణ ప్రభావంతో మనసమాజమూ...కళ్లముందే రూపమూ, స్వరూపమూ, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆచారాలనీ అలవాట్లనీ కూడా అతివేగంగా మార్చేసుకుంటూ వస్తూంది. మనుషులు నీడల్లా అయిపోతున్నారు. తానేమిటి అని కాక ఇతరులకి తాను గొప్పగా కనిపించడం ప్రధాన మయింది. ప్రదర్శనకే జీవితంలో పెద్దపీట వేయబడుతోంది.

నీడ మాతరం నుంచీ, మా ముందు తరం నుంచీ కూడా లేక పోలేదు. మాతండ్రుల రోజుల్లో కూడా చెదురు మదురుగా అయినా చలనచిత్రాలుండేవి. ఆ వెండితెర మాతరంలో విశ్వరూపం ధరించింది. మీ తరం వచ్చేసరికి వెండితెర బుల్లి తెరకు తల వంచవలసి వచ్చింది. తెరేదయినా అసలు మనిషిని కాక నీడని మాత్రమే చూపేదే. మీ తరంలో మంచికో చెడుకో కాలం నిరూపించాలి కాని కంప్యూటర్ స్క్రీన్ వచ్చింది. అది రావడం రావడమే తుఫానులా, వరదలా దేశాన్ని ముంచెత్తేసింది. మనిషిని 'చిప్'లు జయించెయ్యడం మొదలు పెట్టాయి. ఇవాళ-కంప్యూటర్‌లు చేయలేనివీ, మనుషులు చేయగలిగినవీ అతి తక్కువ పనులే మిగిలాయేమో! శాస్త్ర విజ్ఞానమూ, సాంకేతిక పరిజ్ఞానమూ నిస్సందేహంగా అభివృద్ధి చెందవలసిందే. కాని అది...మనిషి మెదడుని బలహీనం చేసేవీ, మనసుని మట్టుపెట్టేవీ, మానవత్వాన్ని మారణహోమం చేసేవీ కాకూడదుకదా?

ఏమిటో సోది-అని విసుక్కుంటున్నావా? ఏం చేసేది? కొన్ని సొదలు కొంచెం దీర్ఘమైన ఉపోద్ఘాతం ఉంటే తప్ప మనసు

కెక్కవు. అందులోనూ ఇది-అతి సున్నితమూ, మహాజటిలమూ అయిన విషయమే కాక అతి కొత్తది కూడా. సమాజంలో కొత్తతరహా మనుషులని, కొత్త తోవనీ సృష్టించే...ప్రారంభించే... విషయం. ఇంతవరకూ బహుశా ఏ కథకుడూ చిత్రించి ఉండని కొత్త సమస్య. ఒకవేళ-ఎవరయినా ఇలాంటి పరిస్థితిలో ఉన్నా-నోరు విప్పి చెప్పుకుని ఉండరు.అందుకే....ఈ పొద్దు నా ముఖానే పొడుస్తూందేమో అనీ, నా తరహా మనుషులు తయారవడానికి నేనే నాంది ఔతున్నానేమో అని...నేను వేయబోతున్న కొత్త అడుగుని సమాజం ఆమోదించినా, హర్షించినా, మానినా, కనీసం క్షమించాలనీ, రేపు నన్ను నలుగురికీ చెడ్డ ఉదాహరణగా చూడకూడదనీ...భగవంతుణ్ణి ప్రార్థించి మరీ నా బాధ బయటపెట్టుకుంటున్నాను. నేను చిత్రమైన మనిషిగా...సెంటిమెంట్లు లేని బండరాయిలా ...సమాజవ్యతిరేకిగా కనిపించ కూడదని దేవుణ్ని కరుణించమని కోరుకుంటున్నాను. ఇలాంటి కథకి నాదే ప్రారంభమేమో. కొంచెం శ్రద్ధగానూ మనసుపెట్టి చదువు.

మనిషి సంఘజీవే. కాని ఈ ప్రపంచ సమాజంలోకి వచ్చేదీ ఒంటరిగానే, పోయేది ఒంటరిగానే. అందుకే ఏమో మనిషికి అప్పుడప్పుడే నా ఒంటరితనం అభిలషణీయ మౌతుంది. ఆ ఒంటరితనం-అందరు మనుషులనుంచి కాదు, తన వాళ్ల నుంచి! అందుకు కారణాలు అనేకం ఉండొచ్చు. మళ్లీ మితి మీరితే ఆ ఒంటరితనమే అతనికి దుర్భరమూ ఔతుంది! అతి సర్వత్రవర్జయేత్ అనేది ఒంటరి తనానికీ, సంఘజీవనానికీ కూడా వర్తించే హితవు. సరే నేను ఉద్యోగంలో చేరిన వెంటనే పెళ్లి చేసుకున్నాను. కాలక్రమంలో ఒక బిడ్డను కన్నాము. అది-నువ్వు. అప్పటికి కుటుంబ నియంత్రణ... ప్రచారంలోనే ఉంది. చిన్న కుటుంబం- చింతలు లేని జీవితం...లాంటి హితోక్తులూ చెప్పేది ప్రభుత్వం. మీ అమ్మ అనుమతీ, అంగీకారాలతోనే నేను ఆపరేషన్ చేయించుకున్నాను. మరి బిడ్డలు కలగకుండా అది-నేనే సామాజిక స్పృహతోనే, దేశంపట్ల పౌరుడిగా నా బాధ్యత అనో చేయించుకోలేదు. నా జీతంలో ఒక బిడ్డని కంటె పెంచలేమనే. కేవలమూ ఆర్థిక కారణాల వల్లనే. ఒక కన్ను కన్నూ కాదు, ఒక బిడ్డ బిడ్డా కాదు అని బంధువులు, మిత్రులు సణుగుతున్నా పట్టించుకోలేదు. మోసే ఎద్దుకే కదా బరువు తెలిసేది? చిరంజీవి! నువ్వు పెరుగుతున్నావు. ఊహించని విధంగా- నా ఉద్యోగంలో పదోన్నతి లభించింది. ఆదాయం బాగా పెరిగింది. అందుకే నిన్ను ఇంజనీరింగ్ లాంటి ఖరీదైన చదువు చదివించ గలిగాను. నువ్వు చక్కగా చదువుకున్నావు. ఇక ఉద్యోగం రావడమే ఆలస్యం అన్న సమయంలో మీ అమ్మ మరణించింది. నేను ఒంటరి నయ్యాను. అది చాలన్నట్లు పదవీ విరమణ తోడయింది. నువ్వేమో- అక్కడ తప్ప నీ చదువుకి తగిన ఉద్యోగాలు ఉండవని-మహానగరంలో. నేను చిన్న పట్నంలో. నీకు ఉద్యోగం వచ్చింది. నీలాగే సాఫ్ట్‌వేర్‌లో పని చేసే అమ్మాయిని నువ్వు నచ్చావు. మెచ్చావు. నీ ఇష్టప్రకారమే ఆమెతోనే నీకు వివాహం జరిపించాను.

అప్పటికే-మనదేశం మీద ప్రపంచీకరణ ప్రభావం విపరీతంగా పెరుగుతోంది. నూతన ఆర్థిక సంస్కరణలను ప్రభుత్వం సత్వరగతిన అమలు పరుస్తూండడంతో నిత్యావసరవస్తువుల ధరలు నింగినంటుతూ, ధనికులు మాత్రమే వినియోగించగలిగే సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎ.సి.కార్లు... మొదలయిన విలాస వస్తువుల ధరలు తగ్గసాగాయి. దేశం ఎటుపోతుందో సామాన్యుడి కర్థంకాని అయోమయం ఆవరిస్తూంది. విదేశీ ఛానల్సు, మీడియాలలో ప్రకటనలు...ప్రచారాలు... దేశ సంస్కృతినీ, ఆచారాలనీ, సంప్రదాయాలనీ చాపకిందనీరులా నీరు కార్చుతూ-'మింగ మెతుకు లేకపోయినా మీసాలకు సంపంగినూనె ఉంటే చాలు' అన్న మస్తత్వాన్ని మనుషులలో విజయవంతంగా నాటి పెంచుతున్నాయి.ఇంట్లో పొయ్యి ఉన్నా లేకపోయినా ఫరవాలేదు, కాని టెలివిజన్ మాత్రం తప్పని సరిగా ఉండాలి అని, లేనివాళ్లు కూడా ఏదో విధంగా ఒక టీవీని కొనేస్తున్నారు. దానిలో వచ్చే సీరియల్స్, సినిమాలూ వాళ్ల మెదడుని కలుషితం చేసి వదులుతున్నాయి. ఆ ప్రకటనలలోని వస్తువులనే కొనాలనీ, అలాంటి జీవితమే జీవించాలనీ సామాన్యులు కూడా కలలు కంటూ... వాస్తవాన్ని విస్మరించి... భ్రమలలోనూ దురాశ లోనూ కొట్టుకుంటున్నారు. సెల్‌ఫోన్, బండీలేని బతుకూ బతుకేనా-అనే సిద్ధాంతం ఏర్పరచుకుంటున్నారు. కాకిలా కలకాలం బతకడం కంటె హంసలా ఆరునెలలు వెలిగినా చాలు, జన్మ ధన్యం-అని భావించడం మొదలు పెట్టారు. కిరాణకొట్లు తగ్గిపోయి -కాస్మటిక్స్ (అలంకరణ ద్రవ్యాలు) అమ్మే షాపులు పెరుగు తున్నాయి. బియ్యం దుకాణాలు వెనక్కి పోతూ... బీర్లూ, బిస్కట్ షాపులూ వృద్ధి చెందుతున్నాయి. అతి ప్రమాదకరమైన మార్పు మనుషుల మనస్తత్వంలో వస్తోంది, అతివేగంగా. భోగలాలస. దానిని తీర్చుకునేందుకు-డబ్బు వెనక పిచ్చి పరుగు...ఆ ఒళ్లు తెలియని పరుగులో మానవతా సంబంధాలను కూడా గాలికి వదిలెయ్యడం. మాతానాస్తి, పితానాస్తి, నాస్తిబంధు సహోదరః ఉన్నది ఒక్కడబ్బే... అనుకునే స్థితికి వచ్చేశాడు మనిషి. ఆధ్యాత్మికత అంతరించిపోగా ఆడంబరంలో మిగులు తున్నాడు. అగ్గిమీద ఆజ్యం పోసినట్లు... సాఫ్టవేర్ రంగం ఒక్కసారిగా అభివృద్ధి చెందడంతో... ఆ కంపెనీల ఉద్యోగులకి భారీ ఎత్తున జీతాలిస్తూండడంతో-సమాజంలో నియోరిచ్ తరగతి బయలు దేరింది. చాలా మంది యువత ఆ తరగతిలోకి చేరారు సాఫ్ట్‌వేర్ పుణ్యమా అని. ఒకప్పుడు చాలా వాసయోగ్యంగా ఉండే బెంగుళూరు వంటి నగరాలు ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇబ్బడి ముబ్బడిగా రావడంతో-సామాన్యుడికి అతిఖరీదూ,సంస్కృతి సంప్రదాయాల పరంగా ధ్వంసమూ, మసలడానికి ఇరుకూ అయిపోయాయి. మామూలు మనుషులు మనుగడ సాగించలేని డబ్బు నగరాలయ్యాయి. దేశంలో చిన్నకుటుంబాలు పెరుగు తున్నాయి. ఇదంతా ఎందుకు వెళ్ల బోయవలసి వస్తుందంటే నేను వేయబోతున్న అడుగు వెనక ఎంత ఆలోచనా, మథనమూ ఉన్నాయో నీకు తెలియాలనే.

భూమిమీద పడే మనిషి అంత వరకూ తల్లికడుపులోని ఉమ్మనీరు చేత ఆవరించబడేట్లే పుట్టినప్పటి నుంచీ ఆర్థిక, సామాజిక, రాజకీయ వలయాలలో బంధించబడి ఉంటాడు.

అతి ప్రమాదకరమైన మార్పు మనుషుల మనస్తత్వంలో వస్తోంది, అతివేగంగా. భోగ లాలస. దానిని తీర్చుకు నేందుకు- డబ్బు వెనక పిచ్చి పరుగు... ఆ ఒళ్లు తెలియని పరుగులో మానవతా సంబంధాలను కూడా గాలికి వదిలెయ్యడం...

తనకి తెలిసినా, తెలవకపోయినా. ఇష్టమున్నా, లేకపోయినా చనిపోయేవరకూ అంతే. జీవించడమూ ఆ వలయాలు చట్రంలోనే. మన ఆలోచనలూ, ప్రవర్తనా కూడా సాధారణంగా ఆవలయాలని దాటవు, ముక్కుమూసుకుని ఏ హిమాలయాల్లోనో తపస్సు చేసుకునే మునులకి తప్ప, నువ్వూ నేనూ-స్పృహ ఉండీ, లేక కూడా ఆ వలాయలలోనే భ్రమణం చేస్తున్నాం.

"మీరొక్కరూ అక్కడెందుకు? మా దగ్గరకి వచ్చేయండి-" అన్నావు టెలిఫోనులో-ఆ వేళ. అప్పటికే నువ్వు కాపురం పెట్టావు.నీ పిలుపుకి నేనెంత పొంగి పోయానో!నేను నా సర్వీసు మొత్తంలో సంపాదించి ఉండని పదిలక్షలను నువ్వు ఒక్క ఏడాదిలో సంపాదింగలిగేంత ప్రయోజకుడి వయ్యావు. కొడుక్కి పెళ్లవడంతో-తల్లి విషమాయే...పెళ్లామూ బెల్లమాయె.' అన్న లోకోక్తిని అబద్ధం చేస్తూ ఈ తండ్రిని నీతో ఉండమని ఆహ్వానించడం-రోజులని బట్టి ప్రత్యేకంగా గర్వపడవలసిన విషయమే. డబ్బుకోసమో, న్యూసెన్సనో-తల్లిదండ్రుల తలలు తెగనరుకుతున్న కొడుకుల రోజులు కదా ఇవి! నీ పిలుపు-నీకు నామీద అభిమాన ముందని రుజువు. ఇన్నాళ్లూ నేననుభవిస్తున్న ఒంటరితనం నుంచి విముక్తి. ఇన్ని కారణాలుగా-నీ పిలుపుకి నేను పొంగి బోర్లాపడినంత పనిచేశాను. ముందున్నది ముసళ్ల పండగ-అని నాకప్పుడు తెలియదు. ఎప్పుడు ఏది జరుగుతుందో ఎవరికీ ముందుగా తెలియదు కదా?

నేను నీ దగ్గరికి వచ్చేశాను. దిగితేకాని లోతు తెలియదు-అనే సామెతలోని సత్యం నిరూపించబడసాగింది. నాకు నువ్వు దేనికీ లోటు చెయ్యలేదు. నాకు ప్రత్యేకంగా గది...టి.వి. పేపరు...మంచి మంచం, పరుపు, పంకా... అలాంటివన్నీ అమర్చావు. మొదటికొన్ని రోజులు-కొత్తవలనో, మార్పు వలనో బాగానే ఉందనిపించింది. కాని.... మెల్లగా...నాకు లేనివేమిటో... తెలిసి రాసాగాయి.

అక్కడ ఒంటరినని రమ్మన్నావు. ఇక్కడ అంతకంటే దుర్భర మయిన ఏకాకితనం. ఎందుకంటే తొమ్మిది కాకుండా నువ్వూ నీ భార్యా వెళ్లిపోతారు. భోజనాల బల్లమీద. ..హాట్ ప్యాక్‌లో నాకు భోజనం ఉంటుంది కాని... ఒక్కడినీ తినాలి కదా నాకు నేనే వడ్డించుకుని? కనీసం మనుషుల మాటలు వినిపించవు.

నీతో కారులో తప్ప ఇల్లు దాటి వెళ్లే వెసులుబాటులేదు. అపార్ట్ మెంట్ గేటునుంచి అడుగు బయట వేశామో...నేనెన్నడూ ఎరగనంత రద్దీ-రోడ్డు మీద. గొలుసు కట్టినట్లు వాహనాలు...చీమలు పాకుతున్నట్లు పాద చారులు. విపరీతమైన కాలుష్యం. ఎన్ని కష్టాలు పడయినా...వెళ్దామంటే...ఎక్కడికి? అనే ప్రశ్న. దానికి జవాబు దొరకదూ. నా భాష వినిపించదిక్కడ. నాకు తెలిసిన ముఖం కనిపించదు కలికం లోకయినా. పరాయి భాషా...ఎరగని ముఖాలూ ఎంతదూరం నడిచినా లభించని వాతావరణ, ధ్వని కాలుష్యాలు లేని ప్రశాంత స్థలం. నిస్పృహ వచ్చేస్తుంది. మళ్లీ వెనక్కి తిరిగి నా బంగారు బందిఖానాలోకి వచ్చేస్తాను. టీ.వీ. ముందో, పేపరు పట్టుకునో నీరసంగా కూలబడతాను.

అక్కడ ఒంటరినని రమ్మన్నావు. ఇక్కడ అంతకంటే దుర్భర మయిన ఏకాకితనం. ఎందుకంటే తొమ్మిది కాకుండా నువ్వూ నీ భార్యా వెళ్లిపోతారు. భోజనాల బల్లమీద...హాట్‌ప్యాక్‌లో నాకు భోజనం ఉంటుంది కాని... ఒక్కడినీ తినాలికదా నాకు నేనే వడ్డించుకుని? కనీసం మనుషుల మాటలు వినిపించవు.

మీరిద్దరూ రాత్రి ఎప్పుడు వస్తారో? మీకే తెలియని ఉద్యోగాలు. శనివారం పేరుకే శలవు కాని ఔటింగ్‌లో, ఏవో ఒకటి ఉంటూనే ఉంటాయి. ఆదివారం ఒక్కరోజే మీరింట్లో ఉండేది. స్నేహితులు రాకపోతే- ఆ వేళ మాత్రం నువ్వూ కోడలూ నాకు దొరుకుతారు. అది కూడా భోజనాల దగ్గర. మాటలు సహజంగా రావాలి మనసులోంచి. కాని...ఇంటర్వ్యూలా ఫలానా సమయంలోనే మాట్లాలంటే ఎన్నో మరచి పోతాడు నాలాంటి వృద్ధుడు. అంతేకాక కొడుకుతో ఇంటర్వ్యూయా! అని అహం పెద్దరికం అడ్డుపడతాయి. నోరువిడదు.

అలాగని నువ్వు నాకేదో లోటు చేస్తున్నావని కాదు సుమా! ఒక విధంగా నేను అనుభవిస్తున్నది రాజభోగమే. కొన్ని కథలలో రాసినట్లూ కొందరి జీవితాలలో జరగినట్లూ ఈతండ్రిని నువ్వు ఇంటి కాపలా చెయ్యలేదు. కిరాణాసామానూ, కూరలూ తెచ్చే నౌకరుగా మార్చలేదు. చెప్పినపనులు చేస్తూ మూలన కూర్చునే పనివాడిగా చూడలేదు. నన్ను ఈ శాయశక్తులా సుఖపెట్టాలనే చూశావు. ఆవిషయంలో నాకేమీ ఫిర్యాదులూ లేవు, ఆరోపణలూ లేవుసుమా! నిజానికి నేనే తాగలేని పిల్లి నయ్యానేమో! పిల్లికి రొయ్యల మొలతాడన్నట్లు నాకు ఈ సుఖాలననుభవించడం చేతకాలేదేమో. ఈ సుఖమయ జీవితం నాపాలిట పిశాచానికి పువ్వుల దండ అయిందేయో! ఇలా ఎందుకు జరిగి ఉంటుందంటే-

నా పుట్టుక, పెరుగుదల అన్నీ మధ్యతరగతిలోనే. అరవయ్యేళ్లు పైగా ఆ తరగతి లోనే బతకడం అలవాటూ పోయిన నేను ఈ ముసలితనంలో మరోలా ఆలోచించనూ లేనూ, జీవనవిధానం మార్చుకోనూలేను. అలవాట్లు ఒకంతట అంతరించవు కదా? నీదేమో నియోరిచ్ క్లాస్. జరిగిన దానిలోనూ... జరుగుతున్న దానిలోనూ తప్పు ఎవరిదీ లేదు. తప్పంటూ ఉంటే అది వ్యవస్థది. మార్పు కాలం తీర్పు కనుక వ్యవస్థనీ తప్పుట్టలేం. నీ జీవన విధానం.. ..ప్రస్తుతపు విధానం.నాది పూర్వపు విధానం. దేనికదే సమంజసమైనది. తండ్రితో కబుర్లాడుతూ కూర్చుంటే నీ ఉద్యోగం ఎలా? నీ తరానికీ, ఈ రోజులకీ అనుగుణంగానే నువ్వున్నావు తప్ప అసాధారణంగా ఏమీ లేదు. రోములో రోమన్‌లా ఉండడమే కాదు, ఏకాలానికి తగినట్లు ఆ కాలంలో ఉండడం కూడా మనిషికి మనుగడకీ అవసరమే. కాలానుగుణంగా జీవించగలగడం కూడా కళే. అందుకే నిన్ను నేను అభినందిస్తున్నాను తప్ప అభిశంసించడం లేదు. నేనే కొత్త జీవన పంథాని అనుసరించలేకపోతున్నాను. నీ జీవన విధానంలోకీ ఆశైలిలోకీ, ఇముడలేక పోతూ ఉక్కిరి బిక్కిరౌతున్నాను. ఊపిరాడక గిలగిలాడుతున్నాను.

నా కోసం నిన్ను మారమనే మూర్ఖత్వం నాలోలేదు. ఆ హక్కూనాకులేదు. అంతవరకూ వస్తే ఎవరి జీవితం వారిదే. అలాగని నేను ఆ పరిస్థితికి రానూలేదు, నీకు అలాంటి పరిస్థితి తేవడమూ లేదు.

నాకు ఈ ఒంటరి తనం నుంచి విడుదల కావాలి. నేను అలవాటు పడిన పరిసరాలూ, వాతావరణమూ కావాలి. నాకు తెలిసిన భాష వినిపించాలి. నేను మాట్లాడగలగాలి. నేను పరిచయ పూర్వకంగానో. స్నేహపూర్వకంగానో పలకరించగలిగే మనుషులుండాలి. నన్ను పలకరించే వాళ్లుండాలి. నీకు

కొంచెమయినా గుర్తింపుండాలి. నాతో స్నేహంగా ఉండాలంటే. నా మాటలు వారికీ వారి మాటలు నాకూ ఉత్సాహపూరితంగా ఉండాలంటే మాది దగ్గర వయస్సులు కావాలి కదా! ముసిలివాడి మాటలు కుర్రాళ్లకి బోరు కొడతాయి చాదస్తం అనిపిస్తాయి. వృద్ధులు కంప్యూటర్ల గురించీ, డేటింగుల గురించీ. సినిమాలగురించీ మాట్లాడరుకదా? అందుచేత నాకు నాలాంటి వృద్ధుల సహవాసమే కావాలి. అదే నాకు తగినదీ. నేను కోరుకుంటున్నది. దానిని నువ్వూ కోడలూ ఎంత మాత్రమూ ఇవ్వలేరు. ఐనా మీకిదే పనా? ఇవేమయినా శ్రవణకుమారుడి కాలమా తల్లిదండ్రులని సేవించుకుంటూ జీవితం గడపడమే పరమార్థం అనుకోవడానికి? ఇది ఎవరికీ వారే యమునాతీరే. ప్రపంచం ఆ విధంగా అయిపోలేదూ ప్రపంచీకరణతో? ఎవరో అన్నట్లు ప్రపంచీకరణతో దేశాలమధ్య దూరం తగ్గిపోయి-మనుషుల మధ్యకీ మనుసుల మధ్య దూరం వచ్చేసింది, ఇది నిర్ద్వంద్వమైన నిజం నిష్ఠురంగా ఉన్నా.

బాబూ! నేను వ్యంగ్యంగా అనడంలేదు సుమా! నన్ను నేను అర్థం చేసుకుని నాబాధ నీకు అర్థం కావాలని...సాధ్యమయినంత స్పష్టంగా చెప్పడానికి ప్రయత్నిస్తున్నానంతే అపార్థం చేసుకోకు సుమా! నేను ఇలా సాహసించి రాస్తున్నది నీ మీద ప్రేమతోనూ, నామీద నాకుండే ప్రేమతోనూ కూడా. చాలామంది చెప్పడానికిష్టపడనివీ, చెప్పలేనివీ నేను తెగించి చెబుతున్నానేమో. తండ్రిగా నీకు నీ జీవితం ఉండేలా చూడాలి. వ్యక్తిగా నాకూ నా జీవితం ఉండేలా చూసుకోవాలి. తనని మాలిన ధర్మం ఉండకూడదు. నీకైనా, నాకైనా. బతుకు బతకనీ. చిరంజీవీ! నువ్వు యువకుడివి, నేను వృద్ధుడిని. నువ్వు కంప్యూటర్ ఇంజనీర్‌వి, నేను కంప్యూటర్ ఇల్లిటరేట్‌ని. నీకు చేతినిండా పని, నాకు నిర్వ్యాపారత్వం. ప్రపంచమంతా నీది, ఒక చిన్న మూలే నాది. అధిక సంపాదన నీది, పింఛను డబ్బులు నావి. నేను నీ తండ్రినే అయినా మనసుకీ మెదడుకీ కవాటాలూ మంచి చెడ్డలూ లేక పోవడంతో ఇలాంటి ఆలోచనలు చెలరేగి నాకు తెలియకుండానే నాలో ఒక విధమయిన న్యూనతా భావం కలిగిస్తున్నాయేమో. నీ దగ్గర నేను సుఖంగా ఉండలేకపోతున్నందుకు మిగిలిన వాటితో పాటు ఇదీ ఒక కారణమేమో.

దీనిలో నువ్వుకాని, నేను కాని బాధపడేందుకేమీ లేదు. మారే కాలంలో పరిస్థితులూ, సమస్యలూ మనస్తత్వాలూ కూడా మారడం సహజం. అర్థం చేసుకుని తేలికగా తీసుకోవడమే వివేకం. మనం ఆర్థికంగా బాగున్నాం. ఒకరినొకరం అర్థం చేసుకోగలం. ఒకరి కొకరం అనవసరంగా ఎందుకడ్డం పడాలీ? నేను నా వయసువారే ఎక్కువగా ఉండే వృద్ధాశ్రమంలో చేరితే బాగుంటుందనుకుంటున్నాను. అది కూడా మన ప్రాంతంలో మనమాట వినపడే చోట. వృద్ధాశ్రమంలో చేరినంతమాత్రాన మనం ఒకరికొకరం దూరమయ్యామని ఎంత మాత్రమూ కాదు. నిజానికి మరింత దగ్గరౌతాం. మనుషులు దగ్గరగా ఉంటే ఎదుటివారిలో లోటుపాట్లూ, దూరంగా ఉంటే సుగుణాలూ కనిపించడం మానవనైజం. నిన్ను చూడాలనిపించగానే నేను నీదగ్గరకు వస్తాను, అలాగే నువ్వూ నా దగ్గరకి వస్తూంటావు. మనకి ఆంక్షలేముంటాయి! మనం విడిపోవడం లేదే. నేనువృద్ధాశ్రమంలో చేరితే-'తాగలేని పిల్లి పాలు ఒలక బోసుకుందన్నట్లు', కొడుకు రమ్మనిపిచినా అక్కడుండక ఆశ్రమంలో చేరాడు ముసిలాడు! అని నన్నూ, 'ఎంతకష్టపడి పెంచి ప్రయోజకుణ్ని చేసిన కన్నతండ్రిని దగ్గరుండనివ్వకుండా తగిలేశాడు అడ్డాలనాడే బిడ్డలుకాని గడ్డాలొచ్చాక బిడ్డలా? రెక్కలొచ్చాయో అందరినీ వదిలి ఎగిరిపోతారు-' అని నిన్నూ నిజం తెలియని లోకులు తీరికుంటే ఆడిపోసు కోవచ్చు. కాని మనం వెరవనక్కర్లేదు. మనం చేసేది మంచే అని. అంతరాత్మ చెప్పినప్పుడు ఆచరించడమే మంచిది.

ప్రపంచీకరణతో సమాజాలు కుంచించుకుపోతూ మనుషులే మిగులు తున్నప్పుడు-మనిషి సమాజం గురించికాక తన గురించే ఆలోచించుకోవడం భావ్యం. ఇది-మనిద్దరికీ వర్తించే సూత్రం.

నాది కొత్త కథ. ఇంతవరకూ తల్లిదండ్రులని దూరం చేసిన కొడుకుల కథలూ, జీవితాలే వచ్చాయి. నాకు తెలిసినంత వరకూ కొడుకుని కాదనలేక పోయినా దూరంగా వెళ్లాని కోరుకుంటున్న తండ్రిని నేను. కొత్తతండ్రిని! అందుకే నాది కొత్త కథా, కొత్త సొదా.

బాబూ! ఆవేశానికీ, ఉద్వేగానికీ లోనవ



కాకుండా శాంతంగా ఆలోచించు. నా ఇబ్బందికి నేనే పరిష్కారం వెదుక్కోడమూ, నా సౌఖ్యం నేను చూసుకోవడమూ తప్ప నేనెవరినీ ఏ విధంగానూ నష్టపరడం లేదు కదా! ప్రపంచీకరణ ప్రభావంలో... చిన్నకుటుంబాల కొత్త సమాజంలో ఇలాగ...నాలాంటి కొత్త తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతూ...వాళ్లూ ఒక తరగతిగా తయారౌతా రేమో ముమ్ముందు.

ఆలోచించు అర్థం చేసుకో నా నిర్ణయాన్ని ఆమోదించు. నా సుఖం కోసమూ, నీ సుఖం కోసమూ నేనే విడిగా ఉంటానంటున్నానంతే.

ఆశీస్సులతో...

కొత్తతండ్రి.